సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

62వ వార్డులో అభివృద్ధి పనులు



డ్రైనేజీ మరమ్మతులను పరిశీలిస్తున్న సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో డ్రైనేజీ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ పశ్చిమ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను సచివాయల కన్వీనర్ నక్కా సూర్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, భవిష్యత్తులో 62వ వార్డు నగరంలోని అన్ని వార్డులకు ఆదర్శంగా నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగవల్లి, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వారాహి హోమం



వారాహి దేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు సోమవారం నుంచి అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజు గురువారం సాయంత్రం వారాహి దేవి అమ్మవారికి పండితుల వేదమంత్రాల మధ్య సహస్ర నామార్చన చేశారు. అనంతరం అమ్మవారిని పూలమాలతో సుందరంగా అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహి దేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, భూ సంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. 23వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం జరుగుతుందని, పాల్గొన దలచిన భక్తులు లలితా పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరోగ్య ఆహార ఫలహారశాల ప్రారంభం



ఫలహారశాలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని స్వీకరించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన ఫలహార శాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సిరిధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలిచే సిరిధాన్యాలను ఉపయోగిస్తూ విభిన్న ఆహార పదార్థాల తయారీ చేస్తూ, విక్రయించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో ఆరోగ్యం, ఆహారంపై అవగాహన పెంపొందించడానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ తులసీరావు, వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కంటి వెలుగు

అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఈ పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ఎంతో మంది వృద్ధులకు చూపు ప్రసాదిస్తోంది.

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా నేత్ర వైద్య పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ



ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల



వృద్ధురాలికి కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు దాటిన వృద్ధులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు..

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 ఏళ్ల వయస్సు దాటిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి వాటిని పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లజోళ్లు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3,394 మందికి ఆపరేషన్లు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో వీటిని నిర్వహిస్తున్నారు.

వృద్ధులకు పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వా–తాతలకు కళ్ల జోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

– డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

అవసరమైన వారికి శస్త్రచికిత్సలు



కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం చేస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరం అయితే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. క్యాటరాక్ట్ ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ విశ్వామిత్ర, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

ఫ్యూజ్‌బాక్స్‌కు తలుపులు అమర్చారు

'సాక్షి'కి స్థానికుల కృతజ్ఞతలు



సాక్షిలో ప్రచురితమైన కథనం



సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని గాంధీజీ వీధిలో 213 నంబర్ గల ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉందని ఈ నెల 20న 'సాక్షి'లో కథనం ప్రచురితం కావటంతో సంబంధిత అధికారులు స్పందించారు. మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చెందిన అధికారులు ఆ ఫ్యూజ్ బాక్స్‌ను ఎవరూ తాకకుండా తలుపులు అమర్చారు. దీంతో స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటక్ అధ్యక్షుడి దృష్టికి పలు అంశాలు



సంజీవ్‌రెడ్డికి పలు అంశాలు తెలియజేస్తున్న భోగవల్లి

మల్కాపురం : ఆల్ ఇండియా ఇంటక్ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని సంజీవ్ రెడ్డి కార్యాలయానికి గురువారం వెళ్లిన భోగవల్లి ఆయనకు విశాఖ పరిధిలో గల నేవల్ డాక్‌యార్డ్, ఎంఈఎస్, ఐవోసీ, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ (ఎల్‌పీజీ ప్లాంట్) లారీ డ్రైవర్స్ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ సాధించిన విజయం, ఇంటక్ నాయకులు కార్మిక సమస్యలపై పోరాడుతున్న తీరు వంటి అంశాలను వివరించారు. అలాగే హిందుస్థాన్ షిప్‌యార్డ్, బీహెచ్‌ఈఎల్‌లో త్వరలో జరగనున్న యూనియన్ ఎన్నికల్లో ఇంటక్ విజయానికి చేస్తున్న కృషిని కూడా తెలిపారు. అదే విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అఖిలపక్ష యూనియన్లతో కలిసి ఇంటక్ చేస్తున్న పోరాటాల తీరును విశదీకరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు అందటం లేదని, ఆయా పరిశ్రమల్లో కార్మికులకు మౌలిక వసతులు అందుబాటులోని అంశాలను తెలియజేశారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యా కానుక కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ జీవీఎంసీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లతో కూడిన విద్యా కానుక కిట్లను వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని, విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుక్కల కృష్ణ, కుమార్ రాజా, బోండా కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ప్రగతి



విద్యార్థులు రూపొందించిన పేపర్ వస్తువులను తిలకిస్తున్న జెడ్సీ కృష్ణ



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న జోన్-5 కమిషనర్ కృష్ణ, కార్పొరేటర్ సుధ

మల్కాపురం: స్వచ్ఛతతోనే ప్రగతి సాధ్యమని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. 61వ వార్డు మల్కాపురంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఇల్లు, చుట్టుపక్కల పరసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హానితోపాటు అనేక అనర్థాలకు దారి తీస్తుందన్నారు. ప్లాస్టిక్‌ను విడనాడి గోనె లేదా క్లాత్, పేపర్ బ్యాగ్‌లు వినియోగించాలని సూచించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎల్లప్పుడూ పచ్చదనంతో ఉంచుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పేపర్, ప్లాస్టిక్ వ్యర్థాలతో వివిధ వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. స్వచ్ఛత వల్ల కలిగే ప్రయోజనాలపై పెయింటింగ్స్ వేసి అక్కడ ఉంచారు. వాటిని తిలకించిన జెడ్సీ కృష్ణ విద్యార్థులను అభినందించారు. విశిష్ట అతిథి వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ సర్టిఫికెట్ల పరిశీలనకు నేడు గడువు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగియనుంది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. మరిన్ని వివరాలకు 63058 72717 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పణ



త్రినాథరావును అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం ఆచార్యుడు పి.త్రినాథరావు ఇండోనేషియాలోని జకార్తాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా 71 మంది పరిశోధన పత్రాలు సదస్సుకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా త్రినాథరావును ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తన కార్యాలయంలో అభినందించారు.

వర్సిటీని సందర్శించిన ఇరాక్ దేశస్తులు



ఇరాక్ దేశస్తులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇరాక్ దేశ విద్యా మంత్రిత్వ శాఖ ఇంగ్లిష్ లాంగ్వేజ్ కరికులం విభాగాధిపతి, ఏయూ పూర్వ విద్యార్థిని హింద్ ఫరూక్ ఆలీ గురువారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీలో అభివృద్ధి జరుగుతున్న తీరు తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరఫున ఫరూక్ ఆలీని వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో హుండీ చోరీ



ఏకేసీ కాలనీ రామాలయం వద్ద పరిశీలిస్తున్న మల్కాపురం క్రైం పోలీసులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని రామాలయంలో హుండీని బుధవారం రాత్రి గుర్తు తెలియని కొందరు ఎత్తుకుపోయారు. గతంలో కాలనీలోని సాయిబాబా గుడిలో ఉన్న హుండీని దొంగిలిస్తుండగా ఆ సమయంలో ఒక వ్యక్తి చూసి అరిచాడు. దీంతో చుట్టుపక్కల వారు నిద్రలేచి దొంగను పట్టుకునే ప్రయత్నం చేయగా.. హుండీని వదిలి పారిపోయాడు. ఈ నేపథ్యంలో రామాలయం గర్భగుడిలోని హుండీని ఎత్తుకుపోయి ఈఎస్ఐ ఆస్పత్రి సమీపాన శిథిలావస్థలో ఉన్న భవనం వద్ద నగదు మొత్తాన్ని తీసుకుని దాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారు. హుండీని చూసిన కొందరు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుకు సమాచారం అందించారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని హుండీ రామాలయంలోనిదేనని గుర్తించి విషయాన్ని మల్కాపురం క్రైం ఎస్ఐ శంకర్‌కు తెలియపరిచారు. దీంతో ఎస్ఐ రామాలయ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్రైం ఎస్ఐకు కార్పొరేటర్ నాగేశ్వరరావు సమస్యను వివరిస్తూ.. ఇటీవల ఏకేసీ కాలనీలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని, రాత్రి వేళల్లో కారు అద్దాలు పగలుగొట్టడం, ఆటో సీటు కవర్లను కత్తిరించడంతో పాటు కొందరు గంజాయి, మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. త్వరలోనే కాలనీ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆకతాయిల ఆగడాలను నియంత్రించేందుకు పోలీస్ యంత్రాంగం ప్రతి రోజు బీటు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరారు.

సమాచారమ్

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని నియోజకవర్గాలకు సంబంధించి ప్రజారోగ్యం, పారిశుధ్య సమస్యలపై అధికారులకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఆయా వార్డులకు సంబంధించి పబ్లిక్ హెల్త్‌పై సమచారం తెలుసుకుకోవచ్చు. కాలువలు, గెడ్డల్లో చెత్తాచెదారం, పూడికలు సక్రమంగా తొలగించకపోయినా.. రహదారులను శుభ్రం చేయకపోయినా.. పారిశుధ్యం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఫిర్యాదులు చేయవచ్చు. పారిశుధ్య సమస్యలపై ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని, అలా కాని పక్షంలో ప్రతి సోమవారం జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ సమక్షంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ తెలిపారు.

జోన్-5 శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిసెంట్ల వివరాలు

వార్డు నం.	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
జోన్-5	డాక్టర్ ఎ.సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	99480 95520
జోన్-5	ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919
41	ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	బెట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎన్.సూరిబాబు.	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	వాల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	మేస్త్రీ(పబ్లిక్ హెల్త్)	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

మల్కాపురం మార్కెట్‌లో తాగునీటి సదుపాయం



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వద్ద గురువారం పైలట్ వాటర్ స్కీమ్ ట్యాంక్‌ను కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు. ఇక్కడ తాగునీటి సదుపాయం లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడేవారు. ఈ ప్రాంతంలో ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, కార్పొరేటర్ సుధల దృష్టికి ఈ సమస్యను స్థానిక వ్యాపారులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు అధికారులతో మాట్లాడి మార్కెట్‌లో పైలట్ వాటర్ ప్రాజెక్ట్ ద్వారా వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి 24 గంటలు వ్యాపారులకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాడి సత్యనారాయణ, స్వప్న, కొల్లి నూకరెడ్డి, నూకరాజు చట్టి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్ మరియు ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ జిల్లా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్. వి.పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా రుణఅవకాశం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90596 65146, 80087 15357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి



డీడీ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న డాక్టర్ బూసి వెంకటరావు

ఎంవీపీ కాలనీ: ప్రభుత్వ బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని బాలికల వసతి గృహాల్లో మరింత భద్రత పెంచాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లాలో ఉన్న పలు సాంఘిక సంక్షేమ శాఖ స్థలాలకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. విదసం ప్రతినిధులు హరిబాబు, సుజాత, నిర్మల, కస్తూరి వెంకటరావు, బల్ల కుమార్, సుదర్శనం పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి



బలభద్ర, సుభద్రలతో జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామి గురువారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్న హాలు వద్ద సుభద్ర, బలభద్ర సహితుడై కొలువుదీరారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఇంద్రద్యుమ్న హాలు వద్ద ఉదయం విష్ణు సహస్ర నామావళి పారాయణం చేశారు. సాయంత్రం సంపత్ వినాయక భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సమర, కమిటీ ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, సన్యాసమ్మ, ఆలయ పూర్వీకులు గురు మోహన్, గోవిందరావు, స్థానిక నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, గెద్దాడ సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, దానబాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com